అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ

- డెవలప్‌మెంట్ ఛార్జీలు తగ్గింపు
- నేటితో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ

మంగళగిరి టౌన్: అవసరానికి మించి విద్యుత్ వాడే వినియోగదారులు లోడ్‌ను క్రమబద్ధీకరణ చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకు దరావత్తులపై 50 శాతం రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలు, మండలాలు, పట్టణాల పరిధిలో 3 కిలో వాట్‌ల వరకు ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు గృహంలోని ఉపకరణాలను లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్‌లు తీసుకుంటారు. ఉదాహరణకు 1 కిలోవాట్ లోడ్‌తో నూతన విద్యుత్ కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డవలప్‌మెంట్ ఛార్జీల కింద సుమారు రూ.2,250 చొప్పున చెల్లించాలి. ఇదే రెండు కిలో వాట్ల లోడ్‌కు డెవలప్‌మెంట్ ఛార్జీ కింద రూ.4,600 చెల్లించాలి. ఇదే మాదిరి 5 కిలోవాట్ల వరకు నిర్ణీత రుసుము చెల్లించాలి. కాగా చాలామంది ఒక కిలోవాట్ లోడ్‌కు కనెక్షన్ తీసుకుంటున్నారు.

వినియోగదారులకు అవగాహన..

గ్రామాల్లో సైతం బహుళ అంతస్తు నిర్మాణాలు పెరుగుతున్నాయి. చాలామంది రెండు అంతస్తుల భవనాలు నిర్మించి విద్యుత్ కనెక్షన్ మాత్రం ఒక్కటే తీసుకుంటున్నారు. ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, గ్రీజర్లు వాడుతూ వారు తీసుకున్న కిలోవాట్ల పరిమితికి మించి విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. అవసరానికి మించి విద్యుత్ వినియోగం కారణంగా లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు తరచూ పాడైపోతున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచేలా విద్యుత్ వినియోగం లోడ్ క్రమబద్ధీకరణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకు 50 శాతం రాయితీ కల్పిస్తూ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. దీనిపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తు చేసుకోవాడానికి జూన్ 30వ తేదీతో అంటే నేటితో గడువు ముగియనున్నడంతో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నేటితో గడువు ముగింపు..

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నేటి వరకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం డెవలప్‌మెంట్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ కిలోవాట్‌కు రూ.2 వేలకు బదులు రూ.1000 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. సోమవారం ఆన్‌లైన్‌లో లేదా ఉపకేంద్రాల్లోని అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని.. సంబంధిత రుసుము చెల్లించి సర్వీస్ క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.



మంగళగిరి విద్యుత్ శాఖ కార్యాలయం



50 శాతం రాయితీ ధరలు

రాయితీ వర్తింపు ఇలా..

అదనపు లోడ్ (కిలోవాట్లలో)	అసలు ధర రూ..	తగ్గింపు ధర రూ..
1 కిలోవాట్‌కు	2250	1250
2 కిలోవాట్‌లకు	4450	2450
3 కిలోవాట్‌లకు	6650	3650
4 కిలోవాట్‌లకు	8850	4850
5 కిలోవాట్‌లకు	11050	6050

క్లుప్తంగా

కార్మికుల సమస్యను పరిష్కరించాలి



తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు కోరారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 208వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలిసి దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. యాజమాన్యం, కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్మికులు షేక్ సుభాని, బి.సూర్యప్రకాశరావు, బాషా, ఆరిఫ్, సుబ్బారావు, వై.సాంబశివరావు, నవనీతం, తుపాకుల నాగేశ్వరరావు, దీనయ్య, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

బలమైన పోరాటాలకు సిద్ధం కావాలి



తాడేపల్లి రూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై బలమైన పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ పోరాడిన ప్రజా సమస్యలు, వాటి పరిష్కారాలను గుర్తుచేశారు. జూలై, ఆగస్టు నెలల్లో జరుగనున్న సీపీఐ మహాసభలను ఆయన వివరించారు. అనంతరం సీపీఐ తాడేపల్లి సెంట్రల్ శాఖ కార్యదర్శిగా మునగాల రామారావును, సభ్యులుగా కర్రి వెంకటేశ్వరరావు, కర్రి సురేష్, మానికొండ భాస్కర్, మునగాల వెంకట మణికంఠ, బాబు, రాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, నాయకులు మానికొండ డాంగే, టి.వెంకటయ్య, మునగాల రామారావు, బాషా, శ్యామ్, బి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మంగళగిరి, మంగళగిరి టౌన్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ డీఎస్ రాజు నాయుడు తెలిపారు. ఆదివారం నగర పరిధిలోని రత్నాలచెరువులో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి వైద్య సేవలు అందించారు. మనిషి ఆరోగ్యంపై దృష్టి సారించి కాపాడుకోవాలన్నారు. ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో ఏళ్ల తరబడి పేదలకు ఉచిత వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్, చర్మ వ్యాధి వైద్యురాలు డాక్టర్ గ్రీష్మ, ఆర్థోపెడిక్ డాక్టర్ పి.వంశీకృష్ణ, ప్రజారోగ్య వేదిక కార్యదర్శి ఎ.జయరాజు, ప్రతినిధులు డి.నాగమణి, వి.బాలకృష్ణ, వి.వెంకటేశ్వరరావు, జేవీ రాఘవులు, చెంగయ్య, ఎం.రవి, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ఎంపిక



మంగళగిరి, మంగళగిరి టౌన్: ఎంటీఎంసీ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఎయిమ్స్) ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. నగర పరిధిలోని నవులూరు నూతన కార్యాలయాన్ని ప్రారంభించి కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రతినిధులు తెలిపారు. అధ్యక్షుడిగా జి.కోటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా పి.శివశంకర్, వైస్‌ప్రెసిడెంట్‌గా ఎన్.సురేష్, కోశాధికారిగా టి.రాంబాబు, జాయింట్ సెక్రటరీగా షాజిద్, కోర్ కమిటీ ప్రతినిధులుగా జి.యోహాను, కె.సతీష్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని అల్లంవారిపాలెం, వసంతనగర్, ఆరోగ్యనగర్, జగనన్న కాలనీ ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ ఆదివారం తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆపదలో ఉన్న వారిని మానవత్వంతో ఆదుకోవాలి



బాధితులకు నిత్యావసరాలు, నగదు అందజేస్తున్న బాల వజ్రబాబు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు

పొన్నెకల్లు(తాడికొండ): ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ మానవత్వంతో ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు(డైమండ్) అన్నారు. ఈనెల 23వ తేదీన పొన్నెకల్లు ఎస్టీ కాలనీలో కొమరగిరి మాణిక్యం, మొలిక అక్కమ్మలకు చెందిన రెండు పూరిళ్లు సిలిండర్ పేలి పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో బాధితులకు కట్టుబట్టలు మాత్రమే మిగిలాయి. మానవత్వంతో స్పందించిన బాల వజ్రబాబు బాధితులకు బియ్యం, నూనె, ఉప్పు, పప్పులు, చింతపండు వంటి పలు నిత్యావసరాలతో పాటు ఒక్కో కుటుంబానికి రూ.2000 నగదు అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, ఉపాధ్యక్షుడు నల్లిబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు చుండు వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు దొంతిరెడ్డి సీతారామిరెడ్డి, ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు శ్రీ హరి, పాములపాడు సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, డి.నాగేంద్ర రెడ్డి, పి.ప్రశాంత రెడ్డి, సీహెచ్ భాగ్యారావు, షేక్ జాన్ సైదులు, ఆర్.వివాజీ, ఆర్.అమర్ నాథ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు

తాడేపల్లి రూరల్: ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు చట్ట ప్రకారం ఇవ్వాల్సిన క్యాజువల్ లీవ్‌లు, వీక్లీ ఆఫ్‌లు ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా అధికారులు పని చేయడం సరైన పద్ధతి కాదని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణనగర్‌లో వాటర్ వర్క్స్ కార్మికులతో సమావేశంలో నిర్వహించారు. దుర్గారావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా చట్టవిరుద్ధంగా వ్యవహరించడం సరైంది కాదని విమర్శించారు. కార్మికులకు 8 గంటల పని పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మురళి రాజు, నరసింహారావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు ఏడాదిగా కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వకుండా అధికారులు తాత్సారం చేయడం తగదని వేముల దుర్గారావు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటలోని మచ్చలు పాయింట్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జూలై 9వ తేదీన దేశ వ్యాప్తంగా జరుగనున్న సార్వత్రిక సమ్మెలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయులు బూరుగ వెంకటేశ్వర్లు, కార్మికులు రాంబాబు, నాగేశ్వరరావు, బాలయ్య, అనూష, శాంత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అక్రమాలపై విచారణ జరపాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు దాసరి రాజు

తాడికొండ: రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో భారీ అవినీతికి పాల్పడుతున్నారని.. దీనిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయాలని గుంటూరు జిల్లా పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు దాసరి రాజు అన్నారు. ఆదివారం తాడికొండ మండలం లాం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ చట్ట ప్రకారం ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయతీల ద్వారానే జరిపించాలని.. కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ ఎక్కడా సక్రమంగా జరగడం లేదన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి ఆదేశాల మేరకు సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 10 గంటలకు స్పందన కార్యక్రమంలో పలు సమస్యల పరిష్కారం కోరుతూ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాడికొండ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పాళ్ల మనోహర్, మైనేని నాగమల్లేశ్వరరావు, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల పంచాయతీరాజ్ అధ్యక్షులు ఈపూరి రమేష్, పూసపాటి వెంకటరామిరెడ్డి, తాడికొండ, ఫిరంగిపురం, మేడికొండూరు పంచాయతీరాజ్ విభాగం మండల అధ్యక్షులు బొంతా శ్రీకాంత్ యాదవ్, గుత్తికొండ ప్రతాప్ రెడ్డి, షేక్ హాజీ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు చుండు వెంకటరెడ్డి, తాడికొండ, లాం గ్రామ పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, షేక్ సలీమ్, మండల పార్టీ కార్యదర్శి రావూరి నరేష్, మైనార్టీ మండల అధ్యక్షులు షేక్ బాబావలి, పార్టీ నాయకులు షేక్ మీర్జావలి, షేక్ అయూబ్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికుల సబ్సిడీ విడుదల చేయాలి

దుగ్గిరాల: రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్ర చేసిన హాజీలకు రావాల్సిన ప్రభుత్వం సబ్సిడీ నిధులును వెంటనే విడుదల చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ సుభాని విజ్ఞప్తి చేశారు. ఆదివారం దుగ్గిరాల ముర్తాజా నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024–25 హజ్ యాత్రకు వెళ్లిన హాజీలు పవిత్ర హజ్ యాత్ర పూర్తి చేసుకున్నా నేటికీ ప్రభుత్వం సబ్సిడీ నిధులను జమ చేయకపోవడం విచారకరమన్నారు. హజ్ యాత్ర 2026 సంవత్సరానికి సంబంధించి ప్రాథమిక ఏర్పాట్ల కోసం కేంద్ర హజ్ కమిటీ ఉత్తర్వులు కూడా జారీ చేసిందని.. జూలై రెండో వారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపిందన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్. రషీద్ సాహెబ్, షేక్.హుస్సేన్ సాహెబ్ పాల్గొన్నారు.

విద్యార్థికి చెక్కు అందజేత



మేడికొండూరు: విశదల సమీపంలోని ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎస్బీ టెట్ రెండో సంవత్సర మూడు, నాలుగు సెమిస్టర్ ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ పి.రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ పి.మనోహర్ తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాలలో అద్దేపల్లి అమిత్ నారాయణ 9.86 జీపీఏ సాధించారని వారు తెలియజేశారు. అలాగే నాలుగో సెమిస్టర్ ఫలితాలలో పత్తిపాటి బ్రహ్మం 10 జీపీఏ సాధించారని అన్నారు. అమిత్ నారాయణకు కళాశాల యాజమాన్యం, ఎస్ఆర్ఐ కళాశాలల చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శరత్ రూ.15 వేల చెక్కును బహుమతిగా అందజేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ డి.సంజయ్, ఏవో సీతారామయ్య పాల్గొన్నారు. ప్రతిభావంతులను కళాశాల సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహిస్తారని పేర్కొన్నారు. కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేతాజీ

తాడేపల్లి రూరల్: కార్మిక హక్కుల పరిరక్షణ కోసం జూలై 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు వై.నేతాజీ పిలుపునిచ్చారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్ కార్యాలయంలో వివిధ రంగాల కార్మికులతో విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉవ్వెత్తున సాగిన కార్మిక వర్గ పోరాటాల ఫలితంగా 1926లో ట్రేడ్ యూనియన్ చట్టం వచ్చిందని అన్నారు. కార్మిక వర్గం రక్త తర్పణం చేసి 44 కార్మిక చట్టాలు పోరాడి సాధించుకున్నారని వివరించారు. వాటి స్థానంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి పెట్టుబడి దారులకు మరిన్ని రాయితీలు కల్పించాలని చూస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో తాడేపల్లి పట్టణ నాయకులు కోట బాబురావు, నాయకులు పల్లె కృష్ణ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా ఇంటికి వస్తే వ్యతిరేకించాలని నేతాజీ ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రకాష్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలకొట్టమని పిలుపునిచ్చిన నారా లోకేష్.. నేడు అవే స్మార్ట్ మీటర్లను ఎలా బిగించమంటున్నారని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్ల వల్ల గంటకి విద్యుత్ ఛార్జీలు టారిఫ్ మారుతుందని అన్నారు.

రైతులకు అన్యాయం చేసేలా ప్రభుత్వ నిర్ణయం

తాడేపల్లి రూరల్: రాజధాని నిర్మాణానికి మరో 44 వేల ఎకరాలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించుకోవడం గతంలో రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేయడమేనని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం ఉండవల్లి సెంటర్‌లో ప్రజాసంఘాల కార్యాలయంలో రాజధాని రైతు సంఘం డివిజన్ కమిటీ సమావేశాన్ని ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే భూముల ధరలు పెరుగుతాయని భావించిన రైతులకు నిరాశ మిగిలిందని అన్నారు. ఉపాధి హామీ నిధులను పెంచాలని.. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని తదితర డిమాండ్స్‌తో జూలై 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రవి, రాజధాని రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాసరావు, గణేష్, నాగేశ్వరరావు, వీర్ల వెంకయ్య, వీరాస్వామి, బక్కిరెడ్డి, దండమూడి సాంబశివరావు, కోటేశ్వరరావు, రామారావు, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్కే ఎర్రపేరు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థినికి పురస్కారాన్ని అందజేస్తున్న ఆనంద్‌కుమార్, హెనీక్రిస్టినా

తెనాలి రూరల్: ఉన్నత విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన బాబూ జగ్జీవన్ రామ్(బీజేఆర్) కమిటీ ఆధ్వర్యంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆదివారం పురస్కారాలను అందించారు. స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో కమిటీ అధ్యక్షులు మేకల సురేష్ అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రదానోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర జీఎస్టీ ఆడిట్ కమిషనర్ పి. ఆనంద్ కుమార్, విశిష్ట అతిథిగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించేందుకు బీజేఆర్ కమిటీ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో 525 మార్కులకు పైబడి సాధించి, పురస్కారానికి ఎంపికైన విద్యార్థులను వారు అభినందించారు. జిల్లాలో 35 మండలాల నుంచి ఎంపికైన మాదిగ సామాజిక వర్గానికి చెందిన 120 మందికి గానూ ఒక్కొక్కరికి రూ. ఐదు వేల నగదు, బ్యాగ్, వాటర్ బాటిల్, పొన్నెకంటి సత్యవేదాంతాచారి జ్ఞాపకార్థం ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు బహూకరించారు. కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి విజయ్‌బాబు, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దోనేపూడి మధుబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ అత్తోట నాగవేణి, 32వ వార్డు కౌన్సిలర్ మట్లపూడి సంధ్యారాణి అతిథులుగా పాల్గొన్నారు. కమిటీ గౌరవాధ్యక్షుడు అత్తోట శరత్ బాబు, కార్యదర్శి నలుకుర్తి సద్గుణరావు, కోశాధికారి సిద్దెల కమలాకర్, నలుకుర్తి రమేష్, అత్తోట శ్యాం పర్యవేక్షించారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం



డాక్టర్ మౌళీకృష్ణను సత్కరించిన అసోసియేషన్ నాయకులు

తెనాలి: కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణానికి చెందిన నేత్ర వైద్యనిపుణుడు మౌళీకృష్ణ తాళ్లూరి సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జూన్ నెల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సమావేశంలో 'వృద్ధాప్యం– నేత్రసమస్యలు–అవగాహన' అంశంపై డాక్టర్ మౌళీకృష్ణ ప్రత్యేక ప్రసంగం చేశారు. జ్ఞానేంద్రియాల్లో కంటికి గల ప్రాధాన్యతను గుర్తు చేశారు. ముఖ్యమైన కంటి సమస్యల్లో శుక్లాలు ఒకటని చెప్పారు. నివారణకు మందులు లేవనీ, కేవలం సర్జరీనే పరిష్కారమని సూచించారు. నీటి కాసులుగా పిలుచుకునే గ్లాకోమా చాలా ప్రమాదకరమని, దీనిపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలని, లేనిపక్షంలో చూపు తగ్గిపోయే అవకాశం ఉందని చెప్పారు. ముందుగా సభాధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ డాక్టర్ మౌళీకృష్ణను సభ్యులకు పరిచయం చేశారు. ప్రసంగం అనంతరం ఆయన్ను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, కొరిటాల జ్ఞానేంద్రప్రసాద్, కొరిటాల ఈశ్వరచంద్, అబ్బూరు రాజారావు, కొలసాని వెంకట కోటయ్య, పూచ్చకాయల కోటిరెడ్డి, నర్రావుల ఆదినారాయణ, కో–ఆప్షన్ సభ్యుడు కుప్పాల చలమయ్య, చెరుకూరి శివరామయ్య పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రక్షిత నీటి పైపులైన్

- మురుగు కాల్వల్లో ఏర్పాటు
- కలుషిత నీరు సరఫరా
- ఇబ్బందులు పడుతున్న 13వ వార్డు ప్రజలు



మురుగు కాల్వలో మంచినీటి పైపులైన్

తెనాలి అర్బన్: కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం.. కొరవడిన అధికారుల పర్యవేక్షణ 13వ వార్డు ప్రజల పాలిట శాపంగా మారింది. రక్షిత మంచినీటి పథక పైపులైన్లను మురుగు కాల్వల్లో ఏర్పాటు చేశారు. అవి లీకే కలుషిత నీరు సరఫరాతో ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథక పైపులైన్లను కాంట్రాక్టర్లు వార్డులో ఎక్కువ శాతం మురుగు కాల్వల వద్ద ఏర్పాటు చేశారు. స్థలం లేకపోవడంతో కొన్నిచోట్ల కాల్వల నుంచి వేశారు. దీంతో అవి అప్పుడప్పుడు లీకవుతూ మురుగునీరు వస్తోందని స్థానికులతో పాటు 13వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కుర్రా సుజాత, పార్టీ నాయకులు కుర్రా శ్రీను ఆరోపిస్తున్నారు. పైపులైన్లను కాల్వలో నుంచి తొలగించి ఇతర ప్రాంతంలో ఏర్పాటు చేయాలని పలుమార్లు కోరినా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్లను మార్చాలని వారు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

తెనాలి: పట్టణానికి చెందిన డాక్టర్ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ భవనంలో ఉచిత షుగర్ వ్యాధి వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఈ శిబిరం కొనసాగుతూ వస్తోంది. సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ డి.శారద వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన దాదాపు 300 రోగులకు ఉదయాన్నే బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. అల్పాహారం అందించాక మరోసారి పరీక్షలు చేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రెజంటేషన్‌తో ఆహారం, వ్యాయామం ప్రాధాన్యతను తెలియజేశారు. పాదాలకు పుళ్లు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. షుగర్ బాధితులు పూర్తిగా మందుల పైనే ఆధారపడకుండా ఆహారం, వ్యాయామంతో నియంత్రణలో ఉంచుకోవాలనేది తమ వైద్యశిబిరం ముఖ్య ఉద్దేశంగా చెప్పారు. ఇదే శిబిరంలో పలువురికి థైరాయిడ్, ఈసీజీ పరీక్షలు కూడా చేశారు. నెలకు సరిపడా మందులను అందజేశారు.

స్మార్ట్ మీటర్లను అనుమతించొద్దు

శాంతినగర్‌లో సీపీఎం నేతల ఇంటింటి ప్రచారం



తెనాలి: విద్యుత్ స్మార్ట్ మీటర్ల మార్పిడికి వినియోగదారులు అనుమతించవద్దని, సంబంధిత ఆదానీ కంపెనీకి చెందిన కాంట్రాక్ట్ కార్మికులను మీటరు మార్చకుండా వెనక్కు పంపాలని కోరుతూ సీపీఎం నాయకులు తెనాలి శాంతినగర్‌లో ఆదివారం ఇంటింట ప్రచారం చేశారు. సీపీఎం నాయకులు కేబీ ప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్ శాంతినగర్ ప్రజలను కలిసి ఆదానీ స్మార్ట్ మీటర్ల బాగోతం వివరించారు. ఒకప్పుడు స్మార్ట్ మీటర్లను పగులగొట్టాలని చెప్పిన రాజకీయ నాయకులే ఇప్పుడు వాళ్లే మార్పిడికి అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని, ప్రజల మనోభావాలతో పని లేదా ? అని ప్రశ్నించారు. ఇదెక్కడి ప్రజాస్వామ్యం అన్నారు. ప్రజల్ని పణంగా పెట్టి పాలక పార్టీలు లబ్ధి పొందుతున్నాయని వివరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అనుమతించొద్దని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com